క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం తనిఖీ



భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ

నగరి: మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ శ్రీదేవి తనిఖీ చేశారు. శనివారం మధ్యాహ్న భోజన సమయానికి పాఠశాలకు చేరుకున్న ఆమె భోజనం నాణ్యతను, మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా ? లేదా ? అనే అంశాలను పరిశీలించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ ఇలాగే మధ్యాహ్న భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు.

8న మండల మీట్

నింద్ర: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 8వ తేదీన జరుగుతున్నట్లు ఎంపీడీఓ అరుణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు. అదేవిధంగా అన్ని శాఖల అధికారులు పాల్గొనాలన్నారు.

ఫిజియోథెరపీ సేవల పరిశీలన



భవిత కేంద్రంలో వైద్యసేవలను పరిశీలిస్తున్న ప్రభాకర్ వర్మ

నింద్ర: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు శనివారం వైద్యాధికారి అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను జిల్లా భవిత ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రభాకర్ వర్మ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచి వైకల్యం ఉన్న పిల్లలకు ఫిజియోథెరపీ చేయడం ద్వారా వారు రాయడానికి, చదవడానికి అలవాటు పడతారని, వారి పనులు వారే చేసుకునేలా అభివృద్ధి చెందుతారన్నారు. మొత్తం 14 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కిషోర్ కుమార్, భవిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

నింద్ర: మండలంలోని కేఆర్ పాళెం గ్రామంలో వెలసిన ఆంజనేయ స్వామివారికి గ్రామస్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం భక్త బృందం ఆలయంలో భజనలు చేశారు.


మెడికల్ షాపుల్లో తనిఖీలు



మెడికల్ షాపులో బిల్లులు తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రూత్

పుత్తూరు రూరల్: పట్టణంలోని పలు మెడికల్ షాపుల్లో శనివారం సాయంత్రం తిరుపతి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రూత్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ మెడికల్ షాపుల్లో మత్తు మందులను విచ్చలవిడిగా అమ్మకాలు జరపరాదని తెలిపారు. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందులు అమ్మితే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. కొనుగోలుదారులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. తనిఖీలు చేసిన షాపుల్లో ఆయా యజమానులకు మందుల పంపిణీపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

కల్యాణి డ్యామ్‌కు 10 లక్షల చేపపిల్లల తరలింపు



జిల్లా మత్స్యశాఖ కార్యాలయం వద్ద ఖాళీగా దర్శనమిస్తున్న చేపల తొట్టె

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో విద్యుత్ మోటార్లు, వైర్లు చోరీకి గురయ్యాయి. దీంతో నీటి సమస్య నెలకొంది. కార్యాలయం వద్ద నీటి తొట్టెల్లో చేపట్టిన 10 లక్షల చేపపిల్లల పెంపకం ప్రశ్నార్థకంగా మారింది. కొత్తగా వైర్లు, మోటార్లు బిగిస్తున్నా రెండు మూడు రోజుల వ్యవధిలోనే దొంగలు మాయం చేస్తున్నారు. దీంతో అధికారులకు ఆందోళన తప్పలేదు. ఈ నేపథ్యంలో 10 లక్షల చేప పిల్లలను శుక్రవారం కల్యాణి డ్యామ్ వద్ద ఉన్న పెంపక కేంద్రానికి తరలించారు. దీనిపై జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ చేపల పెంపక కేంద్రం వద్ద తరచూ విద్యుత్ మోటార్లు, వైర్లు చోరీకి గురవుతున్నాయని తెలిపారు. దీంతో తిరుపతి మత్స్యశాఖ కార్యాలయం వద్ద ఉన్న చేపపిల్లలతోపాటు జాలర్లను కూడా కల్యాణి డ్యామ్‌కు తరలించామన్నారు. వర్షాలు వచ్చిన వెంటనే చేప పిల్లలను చెరువుల్లో వదులుతామని చెప్పారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్ అంధకారం

- ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి, రాస్ ఆర్‌సీపీ కోఆర్డినేటర్ నాగరాజు

కార్వేటినగరం: మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్ అంధకారం అవుతుందని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. శనివారం ఆయన కళాశాలలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంతో జీవితం నాశనం అవుతుందని సూచించారు. అనంతరం రాస్ ఆర్‌సీ ఏపీ నాగరాజు, శబరీదేవి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే మత్తే మనిషి జీవితాన్ని చిత్తు చేసి జీవితాలను సర్వనాశనం చేస్తాయన్నారు. అందుకు యువత మాదక ద్రవ్యాలకు మత్తు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. అలాగే ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధనుంజయరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ గ్రామాల్లో స్నేహితులు మత్తు పదార్థాలు వద్దు...ఆరోగ్యమే ముద్దు అని అవగాహన కల్పించి ప్రాణాలను కాపాడేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు హరిబాబు, బాబు, శివరామకృష్ణ, కార్తీక్, భార్గవి, లావణ్య పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అబద్ధాల మేనిఫెస్టో చూసి మోసపోవద్దు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మణి

శ్రీరంగరాజపురం: టీడీపీ, జనసేన పార్టీల మోసాల మేనిఫెస్టోను చూసి ప్రజలు మోసపోవద్దని వైఎస్సార్‌సీపీ పార్టీ మండల కన్వీనర్ మణి కోరారు. శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014 ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ మూడు పార్టీలు కలిసి 600పైగా హామీలతో మేనిఫెస్టోను ప్రకటించి అధికారం చేజిక్కుంచారని అన్నారు. అయితే అధికారంలోకి వచ్చాక తరువాత ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజలను ఆ మూడు పార్టీలు నిలువునా మోసం చేశాయన్నారు. కానీ సీఎం జగనన్న 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడంతో పాటు మరిన్ని పథకాలను ప్రవేశపెట్టి అర్హత ఆధారంగా సంక్షేమ ఫలాలను అందించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. వచ్చే 2024 ఎన్నికల్లో అవినీతిపరులు, పెత్తందారులు, దత్తపుత్రుడు అంతా ప్రజలను మోసం చేయడానికి ఏకమయ్యారని, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలన్నా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయితేనే ఇవన్నీ సాధ్యమవుతాయని అన్నారు. జగనన్నకు ఓటు వేద్దాం సంక్షేమ పాలన తీసుకొద్దాం అనే నినాదంతో ప్రతి నాయకుడు, కార్యకర్త పని చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, జనార్దన్, భూపతిరెడ్డి, దాము నాయుడు, బాలకృష్ణయాదవ్, హరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణకు స్పెషల్ క్యాంపెయిన్

నగరి: ఓటరు జాబితా సవరణకు ఆదివారం స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ, నియోజకవర్గ ఎన్నికల అధికారి సుజన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ సమ్మరి రివిజన్-2024లో భాగంగా ప్రత్యేక క్యాంపెయిన్ ఉంటుందని బీఎల్ఎలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తప్పక పోలింగ్ కేంద్రాల్లో ఉండాలన్నారు. ఫారం-6, 7, 8, క్లెయిములు స్వీకరించాలని ఆదేశించారు. ఈ తేదీల్లో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రతి పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉంటుందన్నారు. ప్రతి ఓటరు తమ పేరును, కుటుంబ సభ్యుల పేర్లను తనిఖీ చేసుకోవాలన్నారు. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీకి 18 ఏళ్లు నిండేవారు కొత్త ఓటరుగా నమోదుకు అర్హులు అవుతారని వారు ఫారం-6 క్లైములకు అవసరమైన ఆధారాలు సమర్పించాలన్నారు. మృతి చెందిన వారు, వివాహానంతరం ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిపోయినవారు, ఒకే నియోజకవర్గంలో గానీ, ఒక పోలింగ్ కేంద్రంలో రెండుసార్లు నమోదై ఉన్నవారిని తొలగించడానికి ఫారం-7ను సరిపడా ఆధారాలతో సమర్పించాలన్నారు. ఫారం-8(సవరణలు) లో ఓటర్ లిస్టులో పేరు, తండ్రి పేరు, చిరునామాలో ఏవైనా సవరణలు ఉంటే ఫారం-8 సరిపడా ఆధారాలతో సమర్పించి సరిచేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్నదానం



శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో పేదలకు అన్నదానం చేపడుతున్న దాతలు

కార్వేటినగరం: కార్వేటినగరంలో ప్రసిద్ధి చెందిన రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో కార్వేటినగరం వాసి దాత లోకయ్య, బంగారమ్మ కుటుంబ సభ్యులు శనివారం వేణుగోపాలస్వామి ఆలయంలో వందమందికి అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ స్వామివారి దర్శనం కోసం ఇతర మండలాల నుంచి వచ్చి పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఇలా ప్రతి భక్తుడు ముందుకు వచ్చి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకుని తమ దాతృత్వాన్ని చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో లోకయ్య, బంగారమ్మ కుటుంబ సభ్యులు, టీటీడీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

ఓటరుగా దరఖాస్తు చేసుకోండి



పాలసముద్రం: పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ బాబు

పాలసముద్రం: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత విలువైందని, నేతల తలరాతతో పాటు దేశ భవిష్యత్‌ను కూడా నిర్ణయించే ఆయుధం ఓటేనని, అందువల్ల 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ బాబు కోరారు. శనివారం మండలవ్యాప్తంగా బీఎల్ఓలు 24 పోలింగ్ కేంద్రాల్లో ఓటరుగా దరఖాస్తు చేసే కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ బాబు శ్రీకావేరిరాజుపురం, సింహరాజుపురం, పాలసముద్రం, కృష్ణజమ్మపురం పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిల్లో పరిశీలించారు. తహసీల్దార్ బాబు మాట్లాడుతూ ఓటర్ల సవరణకు సంబంధించి ఇప్పటికే బీఎల్ఓలకు శిక్షణ ఇచ్చామన్నారు. బీఎల్ఓ ఓటరు యాప్ వెర్షన్ 4.7 ద్వారా నూతన ఓటరు నమోదు, పాతవి తొలగింపు వంటివి యాప్ ద్వారానే చేయించాలని తెలిపారు. ఓట్ల తొలగింపుపై సంబంధిత ఓటర్లకు నోటీసులు ఇచ్చిన తరువాతే తదుపరి చర్యలు తీసుకోవాలని బీఎల్ఓలకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో బీఎల్ఓలు పాల్గొన్నారు.

డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర, పక్కన జడ్జీలు జానకి, గోపాలకృష్ణ

- పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు రూరల్: స్థానిక సబ్‌కోర్టు ఆవరణలో డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర తెలిపారు. శనివారం స్థానిక సబ్‌కోర్టులో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ అత్యధిక కేసుల పరిష్కారానికి పోలీసు శాఖ కృషి చేయాలని కోరారు. ప్రధానంగా రాజీకి లోబడిన క్రిమినల్ కేసులు, మనోవర్తి కేసులను రాజీ చేయాలని సూచించారు. నగదుతో పాటు విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు మానసిక ఆందోళనలకు దూరం కావాలంటే రాజీ మార్గమే సురక్షితమైనదని కక్షిదారులకు అవగాహన కల్పించాలని వివరించారు. తద్వారా పెద్దసంఖ్యలో కేసులు పరిష్కరించబడే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పోలీస్ స్టేషన్ల వారీగా కేసులపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సి.జానకి, అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి గోపాలకృష్ణ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పుత్తూరు, కార్వేటినగరం సీఐలు లక్ష్మీనారాయణ, సత్తిబాబు, ఎస్ఐలు వెంకటకృష్ణ, దస్తగిరి, సెబ్ సీఐ హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు



వందన

గంగాధరనెల్లూరు: మండలంలోని రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవడంలో పూర్తి సహకారం అందించారని ఏఓ వందన తెలిపారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలో దాదాపు 5,700 మంది రైతులు ఉండగా, వీరిలో 4,749 మంది రైతులు 8,504 ఎకరాల్లో సాగు చేసిన పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. సహకరించిన మండల అడ్వైజరీ కమిటీ చైర్మన్ బలరామ రెడ్డి, ఆర్బీకే సిబ్బందికి ఆమె ధన్యవాదాలు తెలిపారు.

ప్రహరీ పునర్నిర్మాణానికి చర్యలు



కూలిపోయిన గోడను తొలగిస్తున్న స్కూల్ సిబ్బంది

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలోని పుత్తూరు-చిత్తూరు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్ మైదానం ప్రహరీ గోడ కూలిపోయింది. ఈ విషయంపై సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితం కావడంతో హెచ్‌ఎం హేమలత, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం దినకరన్ స్పందించి పునర్నిర్మాణ పనులు చేపట్టాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విద్యాశాఖ అధికారులు ఆదేశాల మేరకు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం దినకరన్, ఉపాధ్యాయులు రమేష్ కూలిన గోడను జేసీబీతో తొలగించారు. త్వరలోనే ప్రహరీ పునర్నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లంలో ఆదివారం తిరుపతి మాధురి రెమిడీ హాస్పటిల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఎంసీ డైరెక్టర్ అత్తూరు సురేష్ రెడ్డి శనివారం తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా మోకాళ్ల కీళ్ల మార్పిడి, వెన్నెముక ఆపరేషన్‌తో పాటు నరాలకు సంబంధించిన వ్యాధులకు చికిత్స చేస్తున్నట్లు చెప్పారు. పచ్చికాపల్లంలోని శివలింగం క్లినిక్‌లో ప్రతి ఆదివారం కూడా ప్రముఖ వైద్యనిపుణలచే చికిత్సలు అందిస్తామన్నారు. వివరాలకు 8074919701 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ



ఉయ్యాల సేవ స్వామి, అమ్మవార్లు

నాగలాపురం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రసిద్ధ శ్రీవేదవల్లి సమేత వేదనారాయణస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అభిషేకం అనంతరం శ్రీస్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చి ఊంజల్ సేవను వేదోక్తంగా నిర్వహించారు. భక్తులు వీక్షించి తరించారు. ఆలయ టీటీడీ అధికారి శ్రీనివాసులు, షరాబ్ ఉదయకుమార్, ప్రధాన అర్చకులు నాగరాజు భట్టాచార్యులు పాల్గొన్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం: శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ఉంజల్‌సేవ వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవి, భూదేవిసమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను అధిష్టింపజేశారు. ప్రాకారోత్సవం అనంతరం ఊంజల్ మండపంలో ఊయలపై కొలువుదీర్చి ఉయ్యాల సేవ నిర్వహించారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, జమేదార్ రాజశేఖర్ పర్యవేక్షించారు.

జగనన్న సురక్ష.. పేదలకు శ్రీరామరక్ష



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేసుకుంటున్న యశోదారెడ్డి

- అందరికీ మెరుగైన వైద్యం అందించాలన్నదే ప్రభుత్వం లక్ష్యం
- జీడీనెల్లూరు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి



అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న యశోదారెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం): ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించడమే సీఎం జగనన్న లక్ష్యమని నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని శాతంబాకం సచివాలయ పరిధిలో సర్పంచ్ జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు చేపట్టని విధంగా సీఎం జగనన్న పాలనలో ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఇటీవల ఫ్యామిలీ ఫిజీషియన్, తాజాగా జగనన్న ఆరోగ్య సురక్ష ప్రవేశపెట్టి ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తున్నారని గుర్తు చేశారు. సురక్ష శిబిరాల్లో స్పెషలిస్టు వైద్యులతో రోగులకు వైద్యం అందిస్తున్నారని గుర్తు చేశారు. గ్రామాల్లోనే అవసరమైన పరీక్షలు చేయడం, ఉచితంగా మందులు అందించడం, మెరుగైన వైద్యం అవసరమైతే ఆరోగ్యశ్రీ, నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేసి కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందిస్తున్న సీఎం జగనన్నకు ప్రజలు రుణపడి ఉండాలన్నారు. అనంతరం మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి పేదవాడి ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందన్నారు. గ్రామాల్లోనే ఉచితంగా ప్రత్యేక వైద్య నిపుణులతో నాణ్యమైన వైద్యసేవలు అందించడంతో ఉచితంగా మందులు అందించడం గొప్ప విషయమన్నారు. అదేవిధంగా గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక వైద్య సౌకర్యాలు కల్పించడమే కాకుండా వారికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అన్నారు. కార్యక్రమంలో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహణలో భాగంగా అంగన్‌వాడీ వర్కర్లు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను అధికారులతో కలసి సందర్శించారు. అలాగే డాక్టర్లు అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మనోహర్, మాజీ ఎంపీటీసీ కృష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూదిమోహన్, ఎస్సీ సెల్ కన్వీనర్ దాము, నీలాపండరినాథ్, నరసింహారెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించండి



మాట్లాడుతున్న ఎంఈఓ విజయకుమార్

కార్వేటినగరం: ఉపాధ్యాయులు విధి నిర్వహణలో తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఎంఈఓ ఎం.విజయకుమార్ అన్నారు. శనివారం మండల విద్యావనరుల కేంద్రంలో ఆయన ఉపాధ్యాయులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు అందరూ విధి నిర్వహణలో కచ్చితంగా సమయపాలన పాటించాలని సూచించారు. విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరు కాకుండా దృష్టి పెట్టాలని, అలాగే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం విద్యార్థులకు అందిస్తూ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పాఠశాల పరిసరాలు, వంటగదులను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అదేవిధంగా మరుగుదొడ్ల నిర్వహణపై వారానికి ఒక్కరోజు ఆయాలకు పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలో తరగతుల వారీగా విద్యార్థుల నోటు పుస్తకాలు, వర్క్‌బుక్‌లను పరిశీలించి ఉపాధ్యాయులు సంతకాలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ప్రగతిని తరగతుల వారీగా మూల్యాంకనం చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, బడి బయట పిల్లలు స్కూళ్లలో ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-22 మనోజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలన అందరి బాధ్యత



బహుమతులు అందజేస్తున్న అధికారులు

పుత్తూరు రూరల్: అవినీతి నిర్మూలన అందరి బాధ్యత అని ఎంఈఓ తిరుమలరాజు అన్నారు. శనివారం పుత్తూరు మండలం పరమేశ్వరమంగళం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇండియన్ బ్యాంకు ఆధ్వర్యంలో జాగరూకతపై అవగాహన వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అవినీతి రహిత సమాజ స్థాపనలో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలన్నారు. అవినీతి కారణంగా అభివృద్ధి కుంటుపడుతుందని తెలిపారు. ప్రభుత్వ ఫలాలు ప్రతి ఒక్కరికీ సమానంగా అందాలంటే అవినీతిని అంతమొందించాలని చెప్పారు. ఇందుకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని కోరారు. అనంతరం అవినీతి నిర్మూలన అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సంకీర్తన ప్రథమ, మిత్ర ద్వితీయ, తనూజ తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. స్థానిక ఇండియన్ బ్యాంకు మేనేజర్ కల్యాణ్‌కుమార్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖర్‌శెట్టి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేడుకగా ఆయుధ పూజ



టీటీడీ ముద్రణాలయంలో ఆయుధ పూజ చేస్తున్న టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి, జేఈవోలు



రవాణా శాఖలో ఆయుధ పూజలు చేస్తున్న టీటీడీ జేఈవోలు, అధికారులు

తిరుపతి కల్చరల్: టీటీడీ రవాణా విభాగంలో శనివారం ఆయుధపూజను వేడుకగా నిర్వహించారు. టీటీడీ జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారికి ఆ విభాగాధిపతి శేషారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. జీఎం శేషారెడ్డి జేఈవోలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో డీఎల్వో వీర్రాజు, వీజీవో బాలిరెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ డీఎం లక్ష్మీప్రసన్న, డీఐ మోహన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా టీటీడీ పరిపాలన భవనం ఎదురుగానున్న ముద్రణాలయంలోనూ ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీవారికి పూజలు చేశారు. అర్చకులు వేద మంత్రాలు పఠిస్తూ యంత్రాలకు పూజలు చేశారు. ఇక్కడ ఉన్న డీటీపీ, ఆఫ్‌సెట్, మెషిన్ సెక్షన్, ఆర్టిస్టు, బైండింగ్ విభాగాల్లోని యంత్రాలకు ఆయుధపూజ చేశారు. అనంతరం రూ.16 లక్షలతో ఏర్పాటు చేసిన ఫర్ఫెక్ట్ బైండింగ్ మెషిన్‌కు ఈవో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సదా భార్గవి, వీరబ్రహ్మం, డీఎల్‌వో వీర్రాజు, ముద్రణాలయం ప్రత్యేకాధికారి రామరాజు, వీజీవో బాలిరెడ్డి, అన్ని విభాగాలకు చెందిన సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.